# బాలమిత్ర

- వాసంతి మాఘపు.

క. వినదగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక వివరింపదగున్
గని కల్ల నిజము దెలిసిన
మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ.

వినినంతనె = వినిన వెంటనే;
వేగపడక = తొందర పడకుండా;
వివరింపదగున్ = ఆలోచించవలయును;
కని = చూచి;
కల్ల = అబద్ధము;

**అర్థం**: ఎవ్వరు చెప్పిన విషయమైనా వినవచ్చు. కాని, వినిన వెంటనే తొందరపడకుండా, అందులో నిజమెంతో, అబద్ధమెంతో తెలిసికొనిన వాడే న్యాయము తెలిసినవాడు.

**సూక్తి**: కలసి ఉంటే కలదు సుఖము.

**అర్థం**: ఐక్యమత్యము (కలసికట్టుగా ఉండడము) ఎంతో బలాన్నిస్తుంది. ఆంగ్లేయులు భారతదేశమును ఆక్రమించుకొనుటకు - భారతదేశములోని రాజులలో ఐక్యమత్యము లోపించడమే కారణము. తమ తమ స్వార్ధముకొఱకు ఎంతో విలువైన సమాచారమును విదేశీయులకు అందజేసి, ఎదుటివారి పతనమునకు, తదుపరి వారి పతనమునకు కారణమైనారన్నది మనకు తెలిసిన విషయమే కదా!

నిన్నె రాముడందుర, నిన్నె రహీమందుర
క్రీస్తు నీవెగాదె, ఆస్తికులకు
పేరుమార్చి పిలువ పెన్నిధి మారునా
అన్నవరములోని ఆదిదేవ!

విద్యుత్తు అవసరార్థము పంకా తిరగడానికిగానో, విద్యుద్దీపము వెలుగుటకుగానో, దూరదర్శిని పరికరము పనిచేయుటకుగానో ఉపయోగపడుతుంది. అటులనే జనుల అవసరార్థము భగవంతుడు ఎన్నో విధములుగా ఆవిర్భవిస్తాడు. అర్థము చేసుకొనేవారికి రాముడైనా, అల్లాయైనా, క్రీస్తు అయినా ఆ భగవంతుని అవతారములే.

ఈ విషయమునే దేవులపల్లి వెంకటకృష్ణశాస్త్రిగారు వారి మాటల్లో 'నారాయణ నారాయణ అల్లా అల్లా మా పాలిట తండ్రి నీ పిల్లల మేమెల్లా' అన్నారు.

## పదమేంటో చెప్పుకోండి!

క్రింద ఇచ్చిన ఆధారములనుపయోగించి పదమేంటో చెప్పుకోండి!

1. ఇది 4 అక్షరముల (ఒక వ్యక్తి) పేరు.
2. రామాయణములో రామునికి ఆప్తుడు.
3. దుష్యంతుడు, శకుంతల యొక్క పుత్రుడు.

**ఏమిటా పేరు?**

1. ఇది 2 అక్షరముల పదము, నక్షత్రము.
2. బృహస్పతికి అర్ధాంగి.
3. అంగదుని తల్లి.

**ఏమిటా పదము?**

(సమాధానములు వచ్చే సంచికలో)

గత సంచికలోని **'సమాధానం చెప్పగలరా?'** సమాధానములు.

1. కళ్ళు నులమడం, కళ్ళు రుద్దుకోవడం, నిద్రపోవడం.
2. శ్రీమద్రామాయణములో నున్నది, శ్రీ మహాభారతములో లేనిది వానర సేన.

- పళ్ళున్నా నోరు లేనిది ఏమిటి?

➔ దువ్వెన, రంపం.

- గుణత్రయం అంటే తెలుసా?

➔ సత్త్వగుణము, రజోగుణము, తమోగుణము

తప్పు- ఒప్పు: రాయడం తప్పు. వ్రాయడం ఒప్పు.

# అవివేకము

ఒక ఊర్లో ఒక నాస్తికుడుండేవాడు. దేవుని నమ్మకపోతే పోయాడుగాని, ప్రతివిషయములోనూ దేవుని నిందించుటే ధ్యేయముగా జీవించేవాడు. ఒకసారి పనిపడి పొరుగు ఊరు వెళ్ళవలసి వచ్చింది. ఆ ఊరు కాస్త దూరము కావడముతో, తినడానికి కావలసిన వస్తువులతోను, రాత్రి ఎక్కడైనా బస చెయ్యవలసివస్తే దానికి కావలసిన సదుపాయములతో బయలుదేరాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడముతో ఒక చెట్టుక్రింద సేదదీరి, భోజనానంతరము భుక్తాయాసముతో చెట్టుక్రిందనే నడుము వాల్చెను. అది ఒక మట్టి చెట్టు. చెట్టువంక చూస్తూ, "ఈ దేవునికి బొత్తిగా తెలివిలేదు. లేకపోతే ఏమిటి? ఇంత పెద్ద చెట్టుకి అంత చిన్న కాయలా? నేలపైన ప్రాకే గుమ్మడి పాదుకు అంత బరువైన కాయలా?" అని హేళనగా అనుకుని, కొంతసేపటికి నిద్రలోకి జారుకున్నాడు.

కొద్దిసేపటికి మేలుకొనిన ఆ నాస్తికుడు, తన పైన, చుట్టూ పడివున్న మట్టి పళ్ళను చూసీ చూడగానే తళుక్కున ఒక ఆలోచన కలిగింది. తనలో తానిలా అనుకున్నాడు "భగవంతుడా! అవివేకముతో నీవు తెలివి తక్కువ వాడివని, మట్టి చెట్టుకు చిన్నకాయలు, గుమ్మడి పాదుకు పెద్ద పెద్ద గుమ్మడికాయలు ఏల సృష్టిస్తున్నావని నిలదీసాను. మట్టిచెట్టు కాయలే పెద్దగా ఉన్నట్లయితే, నేనీపాటికి మరణించి ఉందును. కాయలు చిన్నవిగా ఉండడము మూలమున, నాపై ఇన్ని కాయలు పడినప్పటికీ నేను జీవించి ఉన్నాను. నీ సృష్టిని ప్రశ్నించడము నా అవివేకము కాక మరేమిటి? నన్ను క్షమించి, నీ కృపను నాపై కలుగజేయుము". ఈ విధముగా ప్రార్థించి, తన ప్రయాణమును కొనసాగించెను.

***ఈ కథ వలన నేర్చుకున్న నీతి ఏమిటి?***

*భగవంతుని సృష్టి ఎంతో విలక్షణమైనది. ఊహకు అందనిది. భగవంతుని సృష్టిలో ప్రతివిషయమునకు ఒక అర్థముంది. నిష్ప్రయోజనమైన విషయములు భగవంతుని సృష్టిలో ఏమీ లేవనేది మనమంతా అంగీకరించవలసిన నిజం.*

*ఒక కర్మాగారములో తయారయ్యే వస్తువులు అన్నీ ఒకే విధముగా ఉంటాయి. అందులో కొన్ని లోపములను కూడా కలిగి ఉంటాయి. మరి భగవంతుని సృష్టిలో ఏ రెండు వస్తువులు ఒకే విధముగా ఉండవు; ఏ ఇద్దరు వ్యక్తులు ఒకే విధముగా ఉండరు. చాలా విషయములలో పోలికలు ఉన్నా, అన్ని విషయములలోనూ ఒకే విధముగా ఉండడము అసంభవముగా తోస్తుంది. భగవంతుడు సృష్టించిన ఈ మానవ శరీరములో ఇమిడి ఉన్న అవయవములు, అనుక్షణమూ మన ప్రమేయమే లేకుండా సాగే ఉచ్ఛ్వాసనిశ్వాసములు, జీర్ణప్రక్రియ మొదలైన అంశములు ఈనాటికీ మానవ మేధస్సుకు అంతుబట్టడములేదు.ఇక మానవుని మెదడు పనిచేసే విధమును గురించి చెప్పనవసరములేదు. కాంతి కంటే వేగముగా ప్రయాణము చేయగల శక్తి దానికి ఉంది. ఇక మరణించిన వ్యక్తిని బ్రతికించడము, కొత్తగా వ్యక్తిని సృష్టించడము మానవునికి సాధ్యమా? మరణము అంటే ఏమిటనేది ఈనాటికీ సమాధానము తెలియని ప్రశ్న.*